క్లుప్తంగా

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై సురేష్

వేటపాలెం: రౌడీషీటర్లుగా పేర్లు నమోదైన వారి ప్రవర్తనలో మార్పు రావాలని ఎస్సై జి సురేష్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ నేర ప్రవృత్తిని వీడి మంచి పౌరుడిగా ఎదగాలని సూచించారు. రౌడీషీటర్లపై ఎప్పుడూ పోలీసు నిఘా ఉంటుందని చెప్పారు. అందుకు అనుగుణంగా వారి ప్రవర్తన, నడవడికలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. మీపై పోలీసులకు సదాభిప్రాయం ఏర్పడినప్పుడే రౌడీషీట్ తొలగించేందుకు సిపార్సు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కార్తీకమాస కోటి దీపోత్సవం

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో కార్తీకమాసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం కార్తీక సోమవారం పురస్కరించుకొని సోమవారం సాయంత్రం 5గంటలకు రెండు చెరువుల మధ్యన కోటి దీపాలతో ఉత్సవం నిర్వహిస్తామన్నారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున ప్రత్యేక కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

గుంటుపల్లి, అంబడిపూడిలో నేడు సంకల్పయాత్రలు

బల్లికురవ: వికసిత్ భారత్ సంకల్పయాత్రలు సోమవారం ఉదయం గుంటుపల్లి, మధ్యాహ్నం పెదఅంబడిపూడి పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై టెలీ ఫిలిం ద్వారా అవగాహనతో ప్రజల సమస్యలను తెలుసుకోనున్నట్లు చెప్పారు. మండలస్థాయి అధికారులు ఆయా గ్రామాల్లోని ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలి.

నేడు పూనూరులో పడిపూజా మహోత్సవం

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న త్రిపురసుందరి సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో సోమవారం రాత్రి 7 గంటలకు అయ్యప్పస్వామి పడి పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయత్రం 5 గంటల నుంచి గ్రామోత్సవం, భజన కార్యక్రమం, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల అయ్యప్ప, భవాని, లక్ష్మి దీక్షాపరులు పెద్ద ఎత్తున పడిపూజా మహోత్సవంలో పాల్గొనాలని వారు కోరారు.

నేడు మార్టూరులో అఖండ కర్పూర హారతి..

మండల కేంద్రం మార్టూరులో కార్తీక మాసం ముగింపు సందర్భంగా నేడు 200 కిలోల కర్పూరంతో అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక జాతీయ రహదారి పక్కన గల దుర్గామల్లేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు దాతల సాయంతో కర్పూరం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నందున భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

చీరాల అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సలహాలు, సూచనలు అందించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జంజనం శ్యామల ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రయాణికుల సమస్యలు, మెరుగైన సేవలకు 99592 25696 నంబర్‌కు సంప్రదించాలన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నందీశ్వరునికి పంచామృతాభిషేకం

ఒంగోలు మెట్రో: కార్తీక మాసం సందర్భంగా స్థానిక గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం నందీశ్వరునికి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, భస్మ, చందన, హరిద్ర, కుంకుమాభిషేకం, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శంకరమంచి రామకృష్ణ, శంకరమంచి ప్రసాదశాస్త్రి యాజ్ఞీకంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

భారీ కొండచిలువ కలకలం

అద్దంకి రూరల్: మండలంలోని మణికేశ్వరం గ్రామంలోని ఒకరి ఇంట్లో సుమారు 12 అడుగుల ఉన్న కొండచిలువ ఆదివారం కనబడింది. దీంతో ఇంటి యజమాని సిద్ధయ్య, కుటుంబ సభ్యులు భయాందోళనతో బయటకు వచ్చి చుట్టు పక్కలవారికి తెలియజేడంతో స్థానికులు పట్టుకుని కొండవద్ద వదిలిపెట్టారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గుండ్లనది పరిసర ప్రాంతం వదిలి ఊరిలోకి వచ్చినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. దీనికితోడు ఇళ్లమధ్యలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగటంతో తరుచుగా పాములు కూడా కనబడుతున్నట్లు సిద్ధయ్య తెలిపారు.


ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు


చీరాల: పూజలు చేస్తున్న అయ్యప్పస్వాములు


వేటపాలెం: పూజలు చేస్తున్న భక్తులు

తీరంలో కార్తీక సండే సందడి

- ఆహ్లాదకరంగా వాడరేవు తీరం
- ఉత్సాహంగా కార్తీక భోజనాలు


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి


వేటపాలెం: లక్ష బిల్వార్చన పూజలు చేస్తున్న పండితులు

చీరాల టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని వాడరేవు తీరంతో పాటుగా పలు గ్రామాల్లో కార్తీక వన సమారాధనలతో ఆదివారం ఆహ్లాదకరంగా మారింది. కార్తీకమాసం కావడంతో సుదూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవుకు చేరుకుని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. వాడరేవు తీరానికి చీరాల, పర్చూరు, చిలకలూరిపేట, నర్సరావుపేట తదితర ప్రాంతాలతో పాటుగా తెలంగాణా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో వాడరేవు నిండిపోయింది. చీరాల వాడరేవుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి ఆనందకరంగా తీరంలో గడపడంతో వాడరేవులో సందడి నెలకొంది. మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు, సివిల్ పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేశారు. సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరించి శివనికి ప్రత్యేక పూజలు చేసి అందరు కలిసి సమారాధనలో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెడ్డి సంఘీయుల ఆధ్వర్యంలో..

చీరాలలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమానికి దాదాపు 3 వేలకు పైగా రెడ్డి సంఘీయు కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పలు నృత్య కార్యక్రమాలు, ప్రవచనాలు, సన్మానాలు జరిగాయి. కార్యక్రమంలో వహించిన మన రెడ్డి సంఘ గౌరవ అధ్యక్షులు జీవీ నారాయణ రెడ్డి, రాజు వెంకటేశ్వర రెడ్డి, కోడూరి ప్రసాద్ రెడ్డి, బక్క అద్దంకి రెడ్డి, జయభరత్ రెడ్డి, బద్రి రెడ్డి, దశరథ రెడ్డి, నియోజకవర్గ నలుమూలల నుంచి రెడ్డి సంఘ నాయకులు అత్యధికంగా పాల్గొన్నారు.

దేవాంగులు ఐక్యంగా ఉండాలి..

వేటపాలెం: దేవాంగులు ఐక్యంగా మెలగాలని దేవాంగ కుల గురువు హంపీ పీఠాధిపతి దయానందపురి స్వామీజీ సూచించారు. ఈకార్యక్రమం రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. దేవాంగపురిలోని బీవీ అండ్ బీఎన్ హైస్కూల్ ప్రాంగణంలో 12 గ్రామాల దేవాంగ సంక్షేమ సంఘం దేవల మనోబ్రహ్మ సంఘం ఆధ్వర్యంలో కార్మీక వన సమారాధన ఆదివారం నిర్వహించారు. ముందుగా పందిళ్లపల్లిలోని శివాలయంలో గుల గురువు స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పందిళ్లపల్లి నుంచి హస్తినాపురం వరకు ఊరేగింపుగా హైస్కూల్ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు దేవాంగ నాయకులు ప్రసంగించారు. అనంతరం వనభోజన సమారాధన చేశారు. కార్యక్రమంలో దేవాంగ రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు డీకే నాగరాజు, మాజీ అధ్యక్షుడు చిన్న వెంకట రాయుడు, మాడిశెట్టి శివ శంకరయ్య, జెడ్పీటీసీ బండ్ల తిరుమలాదేవి, మహిళా అధ్యక్షురాలు సజ్జా హేమలత, బండారు ఆనంద్ ప్రసాద్, బాలానందం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సజ్జా వెంకేశ్వరావు, జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షులు కుర్మా రాహుల్జి, ప్రధాన కార్యదర్శి అరుణ్‌బాబు, వోలుకుల మోహనరావు, చల్లా రామారావు, సత్రం మల్లేశ్వరరావు, గుత్తి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.


చీరాల వాడరేవులో పర్యాటకులతో ఆహ్లాదంగా ఉన్న తీరం

భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన..

నాయినపల్లిలో వేంచేసియున్న గంగాపార్వతీ సమేత భోగలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా స్వామి వారికి లక్ష బిల్వార్చనతో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి మాహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. సాయంకాలం భక్తులకు అన్న సంతర్పన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు కారంచేటి చంద్రశేఖరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కారంచేడులో కార్తీక వన సమారాధన..

కారంచేడు: గ్రామ దేవత గంగమ్మతల్లి సన్నిధిలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన గ్రామదేవతలు గంగమ్మ, పోలేరమ్మ తల్లి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉసిరి చెట్టు వద్ద గ్రామానికి చెందిన ముత్తైదువలు, గ్రామ ఆడపడుచులు, గ్రామస్తులు, రైతులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుమారు 10 వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, కమిటీ, గ్రామ పెద్దలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఘనంగా కార్తీక వనసమారాధనలు..

చీరాల అర్బన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఖానస సంఘం చీరాల డివిజన్ (చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలు) ఆధ్వర్యంలో ఆదివారం చీరాలలోని నల్లగాంధీ బొమ్మ సెంటర్ వద్ద గల మహాలక్ష్మమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణ, కార్తీక దామోదర పూజ నిర్వహించారు. కార్తీక మాస విశిష్టత గురించి ఎంఏ శేషాచార్యులు వివరించారు. అనంతరం పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మొమెంటోలు అందించారు. కార్యక్రమంలో చీరాల డివిజన్ వైఖానస సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలానే క్షీరపురి బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక స్వర్ణరోడ్డులోని శివదత్త క్షేత్రంలో వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కార్తీక దామోదర వ్రతం, లలిత సంగీత విద్యాంసులు భాగి కృష్ణమూర్తి, ఆధ్యాత్మిక ప్రవచనకారులు ధర్మవరపు వెంకటరమణ, సంఘ సేవకులు, వయోవృద్ధులు చీరాల రాజారామ్మోహనరావులకు ఆత్మీయ సత్కారాలను నిర్వహించారు. అనంతరం వనసమారాధన చేశారు.


మాట్లాడుతున్న దయానందపురి స్వామీజీ


వాడరేవులో భక్తులను అప్రతమత్తం చేస్తున్న మెరైన్ పోలీసులు


చీరాలలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

చినఅంబడిపూడిలో శివునికి అన్నాభిషేకం


చిన్న అంబడిపూడి దేవాలయంలో భక్తులు


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

బల్లికురవ: శివకేశకులకు ప్రీతిపాత్రమైన కార్తీక మాసం ముగింపులో భాగంగా ఆదివారం మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలోని గంగాపార్వతీదేవి సమేత మల్లీశ్వరస్వామి ఆలయంలో శివునికి అన్నాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూలు చేపట్టారు. నెల రోజులుగా పగలు రాత్రి విశేష పూజలు, అభిషేకాలతో గ్రామం హోరెత్తింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్తీక మాసంలో అందరూ కలిసి ఒకే చోట భోజనాలు చేయడం వల్ల ఆయురారోగ్యాలతోపాటు ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని ఆలయ అర్చకుడు పేటేటి లక్ష్మీ మరప్రసాదరావు తెలిపారు. ఆలయ ధర్మకర్త గంగవరపు వెంకటేశ్వర్లు (పెదకాపు) కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేశారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని భక్తులు ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

ఒంగోలు రూరల్: సంక్షేమ పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండటం ద్వారా సరైన సమయంలో అర్హులకు లబ్ధి చేకూరుతుందని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత అన్నారు. మండలంలోని ఉలిచి గ్రామానికి ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర రథం చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ మంచు మురళి అధ్యక్షత వహించగా కార్యదర్శి సురేష్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ ఒక దేశంగానీ, ఒక రాష్ట్రం గానీ అభివృద్ధి చెందాలంటే పరస్పర సహకారం ఉండాలన్నారు. అప్పుడే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. సువిశాల భారతదేశంలో రాష్ట్రాలన్నీ అభివృద్ధి చెందితేనే దానిని దేశాభివృద్ధిగా పరిగణిస్తారని అన్నారు. ఏపీఎం గోపీనాథ్ పలు పథకాల గురించి మహిళలకు వివరించారు. ఒంగోలు ఏవో కిషోర్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం గురించి వివరించారు. నానోఫెర్టిలైజర్స్ వాడకం, డ్రోన్‌ల వినియోగం, పంట నష్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారం గురించి తెలిపారు. కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి మాట్లాడుతూ ఆయుష్మాన్‌భారత్, టీబీ కంట్రోల్ ప్రోగ్రాం, క్షయ వ్యాధి నిర్మూలన సంస్థల పనితీరు, పుట్టిన బిడ్డ మొదలు వృద్ధుల వరకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి సభలో వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎలిజబెత్‌రాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయశాఖ ప్రతినిధి రాధా శింగమనేని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక మొత్తంలో పంట దిగుబడులు పొందడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ స్థాయిలో అందజేస్తున్న సబ్సిడీల గురించి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మదన్‌మోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జ్ యోగయ్యయాదవ్, జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జ్ శగ్గం శ్రీనివాసరావు, బొద్దులూరి ఆంజనేయులు, వీఆర్‌వో రాఘవరావు పాల్గొని మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


ఉలిచిలో మాట్లాడుతున్న ఎంపీడీవో అజిత

బొద్దులూరివారిపాలెంలో...

గ్రామంలో సర్పంచ్ కవిత అధ్యక్షతన కార్యదర్శి భారతి కన్వీనర్‌గా వ్యవహరించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఎంపీడీవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పథకాల లబ్ధిదారులను గుర్తించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది, వలంటీర్లపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్‌భారత్ కార్డులు అందజేశారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. పీఎం మోదీ ప్రసంగాన్ని లైవ్‌లో చూపించగా రథంపై ఉన్న డిజిటల్ స్క్రీన్ ద్వారా పథకాలకు లబ్ధి పొందే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ వాణి, ఏవో కిషోర్‌బాబు, హౌసింగ్ ఏఈ పృథ్వీ, ఏడీ ప్రభాకర్, సూపర్‌వైజర్ ఎలిజబెత్‌రాణి, ఏపీఎం గోపీనాథ్, డ్వాక్రా సంఘాల వీవోఏలు, కరవది హెల్త్ సూపర్‌వైజర్ మాధవి, హెచ్ఈవో కృష్ణారెడ్డి, అంగన్‌వాడీ, వైద్యారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం బొద్దులూరివారిపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని రాధా శింగమనేనితో కలిసి ఒంగోలు ఎంపీడీవో, కరవది పీహెచ్‌సీ డాక్టర్, తదితరులు సందర్శించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు


మాట్లాడుతున్న లైబ్రేరియన్ విజయభాస్కరరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి): పుస్తక పఠనంతో మేథోశక్తి పొంపొందుతుందని గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆయన ఆదివారం చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా హాజరైన విద్యార్థులతో వివిధ రకాల పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ తరగతి పుస్తకాలతోపాటు వివిధ రకాల పుస్తకాలను చదవడం వల్ల దేశ విదేశ, చారిత్రక, విజ్ఞాన విషయాలు బోధపడతాయన్నారు. తద్వారా లోకజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. ప్రతి విద్యార్థి వీలున్నప్పుడల్లా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం, అనూరాధ నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

చంద్రబాబుది రాజకీయ పర్యటన


లింగిశెట్టి రామాంజనేయులు

పర్చూరు (చినగంజాం): తుఫాను ధాటికి నష్టపోయిన రైతులను ఓదార్చేందుకు చంద్రబాబు చేపట్టిన యాత్ర రాజకీయ యాత్రగా ఉందని ప్రవాసాంధ్రుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు లింగిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. పర్చూరు నియోజకవర్గంలో జరిగిన చంద్రబాబు పర్యటనపై ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగన్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని తట్టుకోలేక చంద్రబాబు ఎన్నికల యాత్రను చేపట్టారన్నారు. ప్రజలందరూ మరోసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కావాలని కోరుకుంటున్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏంచేశారని ఎద్దేవా చేశారు. నీరు–చెట్టు పథకంలో మట్టిని అమ్ముకున్న విషయం మరిస్తే ఎలా అని విమర్శించారు. నాడు వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నేడు రైతుల కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

హక్కులు రాజ్యాంగం కల్పించిన హక్కు



మాట్లాడుతున్న న్యాయవాది హేమలత

వేటపాలెం: మానవ హక్కులు రాజ్యాంగం కల్పించిన హక్కు, అవి అందరికీ జాతి వివక్ష లేనివని న్యాయవాదులు పి హేమలత, శ్రీకాంత్ ఠాగూర్, ఎ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దేశాయిపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణలో చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాదులు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబర్ 10వ తేదీన మానవ హక్కులు అందరికీ ఉండాలనే ఉద్దేశంలో ఈ తీర్మానం ప్రవేశం పెట్టారని గుర్తుచేశారు. పౌరుల హక్కులకు భంగం కలిగినప్పుడు వారిని రక్షించేందుకు న్యాయ స్థానాలు ఉన్నాయని తెలిపారు. ఇటువంటి ఘటలకు ఉచితంగా న్యాయం పొందే అవకాశం కూడా కల్పించడం జరిగిందని తెలిపారు. హక్కుల ఉల్లంఘన జరిగిన వారికి న్యాయసాయం ఉచితంగా పొందేందుకు మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పీఎల్‌వీ డీ ఇమ్మానియేలు, సిబ్బంది. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల అవగాహనకే సంకల్పయాత్రలు


గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న ఎంపీడీవో

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 17 పథకాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించడం కోసమే గ్రామ పంచాయతీల వారీగా వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ అనుప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన నక్కబొక్కలపాడు బల్లికురవ, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా టెలి ఫిలీం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా 14 మందికి ఉజ్వలా గ్యాస్ కనెక్షన్లు ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఎంఈవో కే రమేశ్‌బాబు, బల్లికురవ ఏపీజీబీ మేనేజర్ పీ సుకుమార్, ఎస్ శ్రీలక్ష్మీ, గ్రామ పంచాయతీ సెక్రటరీలు సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.